క్లుప్తంగా

8న రిటైర్డ్ టీచర్స్ సర్వసభ్య సమావేశం

వరంగల్: రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఉదయం10 గంటలకు హనుకొండలోని ఆర్‌టీసీ లోకల్ డిపో సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సారంగపాణి, బి.మల్లారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వచ్చే రెండేళ్ల కోసం జిల్లా కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తామని అన్నారు. సభ్యులంతా తప్పక పాల్గొని సమావేశంను విజయవంతం చేయాలని కోరారు.

నేడు వాహనాల వేలం

మడికొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గుడుంబా అక్రమ రవాణా చేస్తూ దొరికిన వాహనాలను నేడు (బుధవారం) వేలం వేయనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్యాల కిషన్ తెలిపారు. ఒకటి బాజాజ్ పల్సర్ బైక్ టీఎస్ 27ఏ 1066 కాగా, మరో వాహనం అక్రమంగా మద్యం తీసుకొని వెళ్తున్న మారుతి ఎర్టీగా. వాహనాలను జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు మడికొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్ సేన నగర అధ్యక్షుడిగా కరుణ్

కాజీపేట: కేటీఆర్ సేన హనుమకొండ నగర అధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన గబ్బెట కరుణ్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొంగని మనోహర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు నరేష్ మైనాల మంగళవారం ఉత్తర్వులు అందజేశారు.

మహాసభ సంయుక్త కార్యదర్శిగా మహేందర్

హన్మకొండ చౌరస్తా : తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ సంయుక్త కార్యదర్శిగా హనుమకొండలోని 4వ డివిజన్‌లోని రెడ్డి కాలనీకి చెందిన పుట్ట మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మచిలీబజార్‌లోని మహాసభ కార్యాలయ ఆవరణలో మహేందర్‌కు అర్బన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బయ్య స్వామి, పులి రజనీకాంత్‌లు నియామక ఉత్తర్వులను అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చింతాకుల ప్రభాకర్, కోరబోయిన రవి పాల్గొన్నారు.

ముదిరాజ్ అర్బన్ ఉపాధ్యక్షుడిగా శివశంకర్

వరంగల్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బిల్లా శివశంకర్‌ను నియమించారు. మంగళవారం ఈ మేరకు నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ అందజేశారు. ముదిరాజ్ కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలని వారు కోరారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలి

కాజీపేట రూరల్ : మండలంలోని అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్‌షెడ్‌లో స్థానికులకు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగవకాశాలు కల్పించాలని మంగళవారం షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, రైల్వే రిటైర్డ్ నాయకుడు పిల్లి ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది రైల్వే కార్మిక పిల్లలు, ఇతర పిల్లలు టెక్నికల్‌గా ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, పీజీ చదివి ఉద్యోగాలు రాక ఖాళీగా ఉంటూ కుటుంబాలకు భారంగా మారుతున్నారని అన్నారు. రైల్వేశాఖ అధికారులతో మాట్లాడి ఒత్తిడి తీసుకొచ్చేలా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు.

బాలమల్లేష్ మృతి సీపీఐకి తీరనిలోటు



న్యూశాయంపేట : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ ఆకస్మిక మృతి పార్టీకి తీరనిలోటు అని హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బాలమల్లేష్ సంతాప సభను భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. బాల మల్లేష్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు.

డ్రగ్స్ వాడొద్దు

వరంగల్: విద్యార్థులు డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు)లను వాడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని శ్రీమేధా కాలేజీ ప్రిన్సిపాల్ వీరన్నగౌడ్ అన్నారు. మంగళవారం పోచమ్మమైదాన్‌లోని శ్రీమేధా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంతేజార్‌గంజ్ సీఐ షుకూర్, ఎస్సై చాంద్‌పాషా, రవిరాజు, కళాశాల చైర్మన్ కార్తీక్‌గౌడ్, డైరెక్టర్ కుమార్, పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు..

- గుంతలతో దర్శనమిస్తున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

హన్మకొండ అర్బన్ : గ్రేటర్ పరిధిలోని 49వ డివిజన్‌లో రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. ముఖ్య కూడలి ఆదిత్య బార్ నుంచి నాగేంద్రనగర్, ప్రకాష్‌రెడ్డిపేట, దర్గా వెళ్లే 60 ఫీట్ల రోడ్డు ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో మురుగునీరు నిలిచిపోతుంది. నిత్యం ఆటోలు, ఇతర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రాంతాల్లో ఆలయాలు, ప్రార్థనా మందిరాలు ఉండడంతో ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. నాయకులు, అధికారులు ఈ సమస్యను తొందరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్లపై గుంతలు ఏర్పడటంతో నిలిచిన మురుగు నీరు

రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మాణం

- హౌసింగ్ బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- కూల్చివేసిన సిబ్బంది



వరంగల్ చౌరస్తా : రాంకీ ఎంక్లేవ్‌లో హౌసింగ్ బోర్డు ప్లాట్స్‌కు రాకపోకలు సాగించే రోడ్డుకు అడ్డంగా రెండు రోజులుగా నిర్మిస్తున్న ప్రహరీని మంగళవారం హౌసింగ్ బోర్డు సిబ్బంది కూల్చివేశారు. వరంగల్ రైల్వే-ఆర్‌టీసీ బస్‌స్టేషన్‌కు సమీపంలో రాంకీ జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లోని హౌసింగ్ బోర్డు కొంత స్థలాన్ని కొనుగోలు చేసింది. అందులో జీ ప్లస్ 2 గా 102 ఎల్ఐజీ ప్లాట్లను నిర్మించారు. 2023 హౌసింగ్ బోర్డు ప్లాట్స్‌ను స్వాధీనం చేసుకుంది. గత ఏడాది కిందట కేఎంసీ, ఎంజీఎం నర్సింగ్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థినులకు రాంకీ ఎంక్లేవ్‌లోని హౌసింగ్ బోర్డు ప్లాట్స్‌లో తాత్కాలికంగా హాస్టల్‌ను కొనసాగిస్తున్నారు. ఇటీవల నర్సింగ్ విద్యార్థుల రాకపోకలను కొంతమంది ఎంక్లేవ్‌లోని కాలనీవాసులు జీర్ణించుకోలేకపోయారు. ఖరీదైన విల్లాల మధ్య నర్సింగ్ హాస్టల్ నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హౌసింగ్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న హౌసింగ్ బోర్డు ఇంజినీర్లు రాష్ట్ర వైస్ చైర్మన్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంపై బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. దీంతో బల్దియా ఇన్‌వార్డులో ఫిర్యాదు చేశారు. వరంగల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు అంకమరావు ఆదేశాల మేరకు ఏఈఈ వాసు, ఏఈ పృథ్వీప్రసాద్, సిబ్బంది తదితరులు నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు.

నగరాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తా



వరంగల్‌చౌరస్తా : బాలాజీనగర్ జంక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు



కాజీపేట : అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

- బల్దియా మేయర్ గుండు సుధారాణి

హసన్‌పర్తి: నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని బల్దియా మేయర్ గుండు సుధారాణి అన్నారు. నగరంలోని 56వ డివిజన్‌లో రూ. 1.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విలీన గ్రామాల్లో స్మార్ట్ సిటీ పథకం కింద రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రజలు ఏమైనా సమస్య ఉంటే 8096107107కు కాల్ చేయాలని సూచించారు. కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో మారనున్న రూపురేఖలు : ఎమ్మెల్యే నాయిని

కాజీపేట: వరంగల్ నగరానికి ముఖద్వారంగా ఉన్న కాజీపేట పట్టణ రూపురేఖలను మార్చడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట చౌరస్తాలో మంగళవారం రూ.28 లక్షలతో చేపట్టిన సుందరీకరణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ కార్పొరేటర్ రావుల సదానందంను పరామర్శించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే,కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సంకు నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్, కుమార్, అజ్జర్, క్రాంతి భరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వరంగల్ చౌరస్తా : గ్రేటర్ పరిధిలోని 14వ డివిజన్‌లోని పలు కాలనీల్లో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన అభివృద్ధి పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. కాశిబుగ్గ-మార్కెట్ రోడ్డులో రూ.67 లక్షలతో నిర్మించిన జంక్షన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ తూర్పాటి సులోచన, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ : గ్రామపంచాయతీల్లోని కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవోస్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్ కోరారు. మంగళవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ యాకుబ్ నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యశారదాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా నాయకులు వేణుగోపాల్, పి.సదానందం, నాయకులు సదానందం, రామకృష్ణ, గణేష్, కిరణ్, రాజు, విజేందర్, వీరేష్, సురేష్, అనిల్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవోస్, జీపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరానికి విశేష స్పందన

హన్మకొండ అర్బన్ : నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో హెల్త్ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2,3, వాసవి హాస్పిటల్స్ సంయుక్తంగా మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. వాసవి హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ వాసవిరెడ్డి స్త్రీలలో రక్తహీనత, థైరాయిడ్, పీసీఓఎస్, అసాధారణ రుతుక్రమం, పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: హలో బీసీ, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగళవారం మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీ కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో జరిగే కార్యక్రమంలో బీసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కొండా మురళీ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్,బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

హిందువులపై ఆకృత్యాలను నిలిపివేయాలి

విద్యారణ్యపురి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరగుతున్న ఆకృత్యాలను నిలిపివేయాలని ఈనెల 4న నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వరంగల్‌కు చెందిన హిందూ పరిరక్షణ సమితి ప్రతినిధులు ఏనునగొందుల రాజు, ప్రముఖ అడ్వకేట్ సముద్రాల కవిత, మిట్టపెల్లి కపిల్ కుమార్ తెలిపారు. మంగళవారం బాలసముద్రంలోని సామజగన్మోహన్ స్మారకభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 4న ఉదయం 10-30 గంటల నుంచి హనుమకొండ వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ సర్కిల్‌వరకు నిరసన ర్యాలీ చేపట్టబోతున్నామన్నారు.

పేదలకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అండ



ఖిలా వరంగల్: పేదల ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా అన్నారు. మంగళవారం కరీమాబాద్ ఏరియాలోని మల్లు స్వరాజ్యం నగర్‌లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రొయ్యల రాజు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. సమావేశంలో సుమారు 400 మంది పేద గుడిసెవాసులు లిబరేషన్ పార్టీలో చేరారు. వీరందరికి వారు కండువాలు కప్పిపార్టీలో ఆహ్వానించారు.

జాతీయ సమైక్యతతోనే దేశాభివృద్ధి

మామునూరు : ఎన్‌సీసీ కేడెట్లు దేశ సమైక్యతకు పాటు పడుతూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎన్‌సీసీ (9) గ్రూప్ కమాండెంట్ కల్నల్ సచిన్ అన్నారావు పిలుపునిచ్చారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ క్యాంప్ మంగళవారం శిక్షణ ముగిసింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లు సేవాభావాన్ని, దేశ భక్తిని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశం జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ కేడెట్లకు వారు ప్రశంసపత్రాలను అందజేసి అభినందించారు. కల్నల్ ఎస్.కె.భాద్ర డిప్యూటీ కమాండర్ కల్నల్ నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

రవీందర్‌కు సన్మానం

హసన్‌పర్తి : నేత్రదానాలపై అవగాహన కల్పించడంతో పాటు నేత్ర, అవయవ, శరీర దానాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్న రిటైర్డ్ డీఈఈ రవీందర్‌ను మెమోంటోతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిష్ణు వర్మ ఆయనను సన్మానించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని ముచ్చర్లగ్రామానికి చెందిన రిటైర్డ్ డీఈఈ మండల రవీందర్ గ్రామంలో 60 మంది మృతుల నుంచి నేత్రాలు సేకరించడానికి తనవంతు కృషి చేశారు.

సన్మానం

కాజీపేట: 63వ డివిజన్ విష్ణుపురి కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం డాక్టర్ శిగ విజయ్‌కుమార్‌ను గౌడ కులస్తులు ఘనంగా సన్మానించారు. గీత కార్మికులకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్న విజయ్‌కుమార్‌కు సభ్యులు సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

జలమే జీవనాధారం : కేయూ వీసీ

కేయూ క్యాంపస్: జలమే జీవనాధారం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం అధిపతి, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాకలమండలి సభ్యులు బి.సురేష్‌లాల్ రచించిన పుస్తకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. సురేష్‌లాల్ ది వాటర్ స్పిరిచ్యువల్ జెండర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ పర్‌స్పెక్టివ్స్ రిలీజ్ అనే అంశంపై రాసిన పుస్తకాన్ని హైదరాబాద్ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామకిషన్, ఎన్ఆర్ఐ భాస్కర్ బండారి, రిజిస్ట్రార్ మల్లారెడ్డితో కలిసి వీసీ ఆ పుస్తకాన్ని వీసీ తన కార్యాలయంలో వీసీ ఆవిష్కరించారు.

లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలి

లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలోని ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ నూతన విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సూచనలు, సలహాలు కూడా తీసుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్, ఫార్మసీ డీన్ సమ్మయ్య, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

ఫార్మాకాలజీ పుస్తకాల విష్కరణ

కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ రాసిన పుస్తకాలు ఏ టెక్స్ట్ బుక్ ఆఫ్ ఫార్మాకాలజీ-1, 2 ను వీసీ రిజిస్ట్రార్, ఆ విభాగం ఆచార్యులు ఆవిష్కరించారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ

- సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం : సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సులభంగా రికవరీ చేసి ఇచ్చే అవకాశం ఉందని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ చేతుల మీదుగా సెల్‌ఫోన్లకు యజమానులకు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న, దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ***(htt pr-://w-w-w.c-eir.gov.i n)*** ద్వారా బ్లాక్ చేసి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ సతీష్, హోమ్‌గార్డ్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



బాధిత యువతికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం 14వ డివిజన్ ఏనుమామూల సుందరయ్య నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో న్యాయవాది గంధం శివ తల్లిదండ్రులు గంధం సారమ్మ-గోపాల్‌ల జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు పేదలకు వరమని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, అడప మహేష్, శ్రీను, అభిలాష్, శంకర్, చిన్ని, కుమార్, రాజేష్, రాజునాయక్, నరేందర్, వెంకటేష్‌నాయక్, మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఎమ్మెల్యేను కలిసిన మహిళలు....

ఎమ్మెల్యే నాగరాజును బాలాజీనగర్ జంక్షన్ వద్ద ఎన్టీఆర్ నగర్‌లో ఇటీవల నూతనంగా ఎన్నుకోబడ్డ ఎన్టీఆర్ నగర్ మహిళా అభివృద్ధి కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి బొకే అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి, నజీమా, ప్రభావతి, అన్నపూర్ణ, ఎలేంద్ర, రమ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



ఉమేష్ చంద్ర (ఫైల్)

వరంగల్ చౌరస్తా : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. ఖిలావరంగల్ ఫోర్ట్‌రోడ్డులో టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు పడిగే శ్రీనాథ్ కుమారుడు ఉమేష్ చంద్ర (18), అతని స్నేహితుడు యువరాజు హంటర్ రోడ్డులో వ్యక్తిగత పనిమీద బైక్‌పై వెళ్తున్నారు. సంతోషిమాత దేవాలయం వద్ద యూ టర్న్ తీసుకొనే క్రమంలో వాహనం అదుపు తప్పి ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉమేష్ చంద్ర, యువరాజు ఎగిరి రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో హనుమకొండ వైపు వెళ్తున్న అశోకా లే ల్యాండ్ లారీ మీది నుంచి పోవడంతో ఉమేష్ చంద్రకు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. యువరాజును చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాజీపేట జంక్షన్‌లో గుర్తుతెలియని వ్యక్తి..

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి కథనం ప్రకారం.. రైల్వే స్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతిడి కుడిచేతిపై అనిత అని పచ్చబొట్టు రాసి ఉంది. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో, 9440027342, 812780796 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

మామునూరు : అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..నక్కలపల్లికి చెందిన మన్నె కొమ్మాలు(82)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరి వివాహం చేశాడు. ఐదు రోజుల క్రితం కొమ్మాలుకు పక్షవాతం రాగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఆదివారం సాయంత్రం ఇంటికి చేర్చా రు. అనారోగ్య కారణాలు వెంటాడంతో మనస్తాపం చెందిన కొమ్మాలు మంగళవారం తన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే మామునూరు పోలీస్ స్టేషన్, ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందజేశారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించారు. మృతుడు మనువడు వర్కల తరుణ్ బాబు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

వ్యాపారిపై హత్యాయత్నం

కాజీపేట: ఉదయం జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని ఓ వ్యాపారిపై గుర్తుతెలియని యువకుడు మంగళవారం రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. 47వ డివిజన్ డీజిల్ కాలనీలో ప్రధాన రహదారిపై సిమెంట్ బ్రిక్స్ వ్యాపారం చేసే అలువాల మాలకొండయ్యతో ఉదయం పట్టణానికి చెందిన ఓ యువకుడు బ్రిక్స్ కొనుగోలు విషయంలో ఘర్షణ పడ్డాడు. అది మనస్సులో పెట్టుకున్న యువకుడు రాత్రివేళలో కత్తితో పాటు పలు కవర్లలో పెట్రోల్ నింపుకుని ఇంటికి వెళ్లడానికి బయటకు వచ్చిన మాలకొండయ్యపై కత్తితో దాడి చేసి గొంతుకోయడానికి ప్రయత్నించాడు. కాలనీవాసులు కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న వ్యాపారి చిన్న కుమారుడు పరుగెత్తుకు వచ్చాడు. కత్తిపోట్లకు గాయపడిన మాలకొండయ్యను కుటుంబ సభ్యులు ఓ ఆసుపత్రికి తరలించారు.

ఘటనా స్థలానికి ఏసీపీ రాక...

మాలకొండయ్యపై దాడి జరిగిన సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్‌తో పాటు సీఐ సుధాకర్‌రెడ్డిలు పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. విడి పెట్రోల్‌ను నిందితుడు ఎక్కడ కొనుగోలు చేశాడు అనే కోణంతో పాటు రహదారులపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఏసీపీ తిరుమల్ ప్రత్యక్ష సాక్షులతో చర్చించారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

ఖిలా వరంగల్: పడమరకోట పద్మశాలి వీధిలో ఆకస్మాత్తుగా హై ఓల్టేజీ రావటంతో పలు ఇళ్లల్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఎలక్ట్రానిక్స్ పరికరాలు కాలిపోవంతో భారీగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రాణాలు త్యాగం చేసిన అమరులను మరువమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో, కేయూ క్యాంపస్‌లో, హసన్‌పర్తిలో కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని నిర్వహించారు. శ్రీకాంతాచారి చిత్రపటానికి పార్టీ నాయకులతోకలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



హన్మకొండ : శ్రీకాంతాచారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్



కేయూ క్యాంపస్ : కేయూ మొదటి గేట్ వద్ద..



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు

పంచరాయి భూమికి పట్టాలివ్వాలి

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని వేలేరు మండలం కన్నారం గ్రామపరిధిలో గత కొన్నేళ్లుగా రైతులు సాగుచేసుకుంటూ జీవిస్తున్న పంచరాయి భూమికి పట్టాలివ్వాలని గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొన్నాల సమ్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సంఘం నాయకులు, రైతులతో కలిసి డీఆర్‌ఓ వై.వి గణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సేద్యం చేస్తూ జీవిస్తున్న సుమారు 150 మంది రైతులకు భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్‌లు మంజూరు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే రైతుబంధుతో పాటు పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక తహసీల్దార్, జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొగిలిచర్ల వీరస్వామి, మార్క వెంకటయ్య, ఇజిగిరి రవీందర్, బొల్లం కనకయ్య, సింగారపు శాంత, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓ వై.వీ గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

ఉపముఖ్యమంత్రిని కలిసిన టీఎస్ఈఈయూ నాయకులు

హన్మకొండ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327 నాయకులు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి నేతృత్వంలో నాయకులు కలిసి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు టీఎస్ఈఈయూ-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు.

